# గురుదక్షిణ

గంటన్నరలో పరీక్ష మొదలు.

ముందురోజు రాత్రి కాకినాడ జేరుకున్నాను. నాతో బాటు ఎమ్సెట్ రాస్తూన్న మా ఊరు రాజిగాడు- మహేశ్వర్‌తో కలిసి వచ్చి కాకినాడ మా అమ్మమ్మగారింట్లో దిగాను.

మా అమ్మమ్మ ఆచారం సంగతి నాకు తెలుసు కనుక భయపడి రాజిగాణ్నీ మహేశ్నీ ఆ రాత్రి హోటల్లో భోజనం చేయండర్రా అని పంపించాను... కాదు.. తినిపించాను.

పొద్దున్నే బయల్దేరి సెంటర్ చూసుకుని దగ్గర్లో ఉన్న ఆనంద్ భవన్ హోటల్‌కి వెళ్లాం.

మూడు ప్లేట్లు ఇడ్లీ ఆర్డర్ చేశాం.

బేగ్‌లో పుస్తకాలు బైటికి తీశాం. అందరం కలిసొచ్చాం గానీ, ఒకరికొకరు పోటీ పడుతున్నాం. ఒకర్నొకరు అణగదొక్కి నిలవాలి.

కాంపిటీటివ్ పరీక్షలంటే అదే. మనం బాగా రాయటం కాదు. అవతలి వాడు మనకన్నా బాగా రాయకూడదు. నాకెందుకో ఈ దుష్ట బుద్ధి నచ్చలేదు గానీ... బాగానే అలవాటైంది.

మేథమెటిక్స్‌లో ఒక రెండు ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయటం నాకు అస్సలు చేతకావట్లేదు.

దొంగలా పుస్తకం తీసి, మెల్లగా మా వాళ్లని అడిగాను. నాకు తెలియనట్లు కాదు. వాళ్లకి తెలుసా అని అడగటానికి- నేను నేర్చుకుందామని.

వాళ్లూ తెల్లమొహం వేశారు. కొంత ఆనందం.

మా డిస్కషన్ ప్రొప్రైటర్ వింటున్నాడు. అందరికీ సరిగ్గా టిఫెన్స్ సర్వ్ అవుతున్నాయా లేదా అజమాయిషీ చేస్తున్నాడు అతను. ఉండుండి అతని చూపూ చెవీ మా మీద పడుతోంది.

ముగ్గురం వాగ్వివాదాలు పడుతున్నాం.

"అయినా కాంపిటీటివ్ పరీక్షలకి ఎ బి సి డి టిక్ చేయడమే కదా. ఈ గందరగోళం దేనికి" అన్నాడు రాజిగాడు.

"కళ్లు మూసుకుని ఏదో అక్షరం మీద టిక్కు పెట్టే గుడ్డాట కాదురా... ప్రాబ్లెం తెలిస్తే ఆన్సర్ ఈజీ అవుతుంది" మహేశ్ చెప్పాడు.

"అదీ పాయింట్" బలంగా అన్నాను.

"హౌటు సాల్వ్ ఇట్"

ఓనర్ మా దగ్గరకొచ్చాడు.

పేపర్ నేప్‌కిన్ తీసుకుని ఆ ప్రాబ్లెం సెకన్స్‌లో సాల్వ్ చేశాడు.

అందరం షాక్!!!

"నీకవన్నీ... అహ్... మీకివన్నీ ఎలా తెల్సు..."

"బాబూ... నేను ఈ హోటల్ పెట్టేటప్పుడికే కర్నాటకలో మేథ్స్ డిగ్రీ చేశాను. మాకూ మీకూ పుస్తకాలూ, మెథడ్స్ మారతాయి గానీ... అంకెలు మారవు. అప్పుడూ ఇప్పుడూ అవే అంకెలు!!" చాలా సింపుల్‌గా జవాబు చెప్పి దాటిపోబోయాడు.

"అంత తెలివితేటలు ఉండి మీరిలా హోటల్ పెట్టుకొనీ..." నా ప్రశ్న పూర్తవ్వలేదు.

"హోటల్ పెట్టుకోటానికి తెలివి తేటలు అక్కర్లేదా?" అన్నాడాయన.

మాకు జవాబు దొరకలేదు.

నవ్వుకుంటూ వెళ్లిపోయాడు ప్రొప్రైటర్.

నేను చల్లగా అతను సాల్వ్ చేసిన లెక్కని జేబులో కుక్కుకున్నాను. మా వాళ్లు మళ్లీ ఆ కాయితం చూడకుండా గబ గబా టిఫెన్ తినేయమని తొందరపెట్టి... కంగారు పెట్టి... ఇంకా హడావుడి పెట్టి... ఎగ్జామ్ హాల్‌కి పరిగెట్టించాను.

నిజంగా హోటల్ ప్రొప్రైటర్ రాసిచ్చిన నేప్‌కిన్ నాకెంతో ఉపయోగపడింది.

✢ ✢ ✢

మూడేళ్లు గడిచాయి.

గుల్‌బర్గాలో నాకు బి.ఇ. సీటు వచ్చింది. అమ్మమ్మకి వంట్లో బాగాలేదంటే హడావుడిగా కాకినాడ వెళ్లాను.

అంత హడావుడిలోనూ... కాస్త ఖాళీ చేసుకుని ఆనంద్ భవన్ కెళ్లాను.

అవే బేంచీలు అదే ప్లానింగ్. సర్వర్లు కూడా మారలేదు. ప్రొప్రైటర్ సీట్లో లేడు.

ఒక సీట్లో కూచున్నాను. వెయిటర్ వచ్చాడు. ఏం తింటా... భోం చేసొచ్చా.

"ఓ కాఫీ" ఆర్డర్ చేశాను.

కాఫీ తెచ్చాడు. తాగుతున్నాను.

బిల్లు తెచ్చి ఇచ్చాడు వెయిటర్.

ప్రొప్రైటర్ తన సీట్లోకొచ్చి కూచున్నాడు. ఆయన పేరేంటో నేను కనుక్కోలేదు. కానీ ఆయన్ని మర్చిపోలేదు.

తెల్లటి జుట్టు సగం పైకి పోయి ఉంది. తెల్లటి మీసాల్లో అక్కడక్కడ గ్రే టచ్. చెవి చివరిదాకా సాగిన సైడ్ బర్న్స్! మిగిలిన కొద్ది భాగం నీట్ షేవింగ్- దబ్బపండు రంగు మొహంలో బ్యూటీస్పాట్ లాంటి స్ఫోటకం మచ్చలు. అయినా ఎంతో అందంగా, గొప్పగా అనిపిస్తాడు. మనకి నచ్చిన మనిషి ఎలా ఉన్నా అతన్లో నచ్చిన విషయాల వల్ల అందంగా కనిపిస్తాడని నాకో నమ్మకం. వాళ్లలో ఉన్న టేలంటే వాళ్లకి గ్లామర్.

గ్లామర్ అంటే అందం కాదు. ఆకర్షణ.

ఆ మాటకొస్తే మన దేవుళ్లలో చాల మంది రకరకాల జంతువుల

రూపంలో ఉంటారు. వాళ్లది అందం కాదు. అద్భుతమైన ఆకర్షణ. కోయిల నల్లగా ఉంటుంది. పాట తీయగా ఉంటుంది. ఘంటసాల ఎన్టీఆర్ అంత అందంగా ఉండకపోవచ్చు గాక... అంతకన్నా నాకు నచ్చుతాడు.

నాకు ఆనంద్‌భవన్ ప్రొప్రైటర్ గుర్తొచ్చినప్పుడల్లా ఆయన ఎంతో నచ్చేస్తాడు.

దేవుళ్లా అనిపిస్తాడు. అది అతను నాకు చేసిన సాయం వల్లకాదు. ఆ లెక్క చేస్తోన్నప్పుడు అతను చూపిన చాకచక్యం- ఆలోచనలో ఆగని వేగవంతమైన క్లారిటీ.

మూడేళ్ల క్రితం అతను నా ముందు వంగి పేపర్ నేప్‌కిన్ మీద టకటకా వేసిన స్టెప్స్, వేస్తున్నప్పుడు కనిపించిన కాన్ఫిడెన్స్... నా మెదడులో ముద్ర వేసుకుని ఉన్నాయి.

ఆయనలో ఏం మార్పు లేదు.

నేనీ మూడేళ్లలో బాగా మారాను. రేజర్ వాడేంత ఎదిగిపోయాను. నీడపట్టున హాస్టల్‌లో తిండీ... పక్కనే కాలేజీ కనక కాస్త రంగు కూడా వచ్చాను. నన్నాయన పోల్చుకోలేడు. పైగా రెగ్యులర్ కస్టమర్ని కాను. అకేషనల్ అతిథిని.

కాఫీకి ఇచ్చిన బిల్లు సోంపు పోసిన ప్లేట్‌తో దగ్గరికి లాక్కున్నాను. కాఫీ 3 రూపాయలు. నేను నవ్వుకున్నాను. 3 రూపాయలతో బాటు వస్తూ వస్తూ ముప్పై రూపాయలు పెట్టి ఆయన కోసం కొన్న కాకినాడ కాజా బాక్స్ నా బేగ్‌లోంచి తీసి దానిమీద వెయిటర్ ఇచ్చిన బిల్లు పెట్టి ప్రొప్రైటర్ ముందుకు వెళ్లాను.

అనుకున్నట్లుగానే నన్ను గుర్తు పట్టలేదు.

'ఏంటిదీ' అన్నట్లు తలెత్తి చూశాడు పెద్దాయన.

నేను పరిచయం చేసుకున్నాను.  ఫ్లాష్‌బేక్ చెప్పాను.

"మీరావాళ చెప్పిన రెండు లెక్కలూ నాకెంతో ఉపయోగ పడ్డాయి. మీరావేళ అనాయాచితంగా వచ్చి వేసిన రెండు లెక్కలూ ఆవేళ పరీక్షలో అక్కరకొచ్చాయి.  నేను 90 పర్సెంట్ గెయిన్ చెయ్యగలిగానంటే మీరు చేసిన హెల్పే కారణం" ఈ మాటలు చెప్తుంటే నా గొంతు వణికింది. "నేప్‌కిన్‌తో పరీక్ష హాల్లోకెళ్లిన నాకు కాపీ చేయటం తప్పనిపించినా తప్పదనిపించింది.  నేను బీటెక్ సీటు సంపాదించుకున్నాను" అని ఉన్న కథ ఉన్నట్లు చెప్పాను.

ఆయన తప్పు పట్టుకోలేదు.  చల్లగా నవ్వాడు.

స్వీటు బాక్స్ చేతికిస్తూ "ఇది గురుదక్షిణ అనుకోండి" అంటూ మొహమాట పడ్డాను.

ఆయన తియ్యగా నవ్వాడు.

"అమ్మో.. నాకు కూడా ఓ శిష్యుడు ఉన్నాడన్నమాట" అన్నాడు షేక్ హేండిస్తూ.

కృతజ్ఞతాభావంతో నా కళ్లు చెమరిస్తున్నాయి.  కానీ...

ఆయనెందుకు థ్రిల్ అయిపోవట్లేదు?

నాకు అర్థం కాలేదు.

అదంతే... అన్నీ ఉన్న ఆకు అణగి మణిగి ఉంటుంది.

ఏమీలేని వాళ్లం... ఎగిరెగిరి పడతాం.  కాదు ఎక్కడికో వెళ్లిపోతాం అనిపించింది.